క్లుప్తంగా

ఉగాది ఉత్సవాలను విజయవంతం చేయాలి

పాల్వంచ: పట్టణంలోని బీసీఎం రోడ్డులో ఆదివారం నుంచి పాల్వంచ కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న ఉగాది ఉత్సవాలను విజయవంతం చేయాలని కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బిక్కసాని సుధాకర్ రావు, అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శీరంశెట్టి కాంతారావు, నరసింహారావు, డాక్టర్ నామా బుచ్చయ్య, రావి మోహన్ రావు, ముగిద శ్రీనివాస్, కొండల్ రావు పాల్గొన్నారు.

ఈద్గాల పరిశీలన

ఇల్లెందు: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ కోసం అన్ని ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కోరారు. శనివారం సిబ్బందితో కలిసి ఈద్గా ప్రదేశాలను సందర్శించి పరిశీలించారు. ఈద్గాల వద్ద చెత్త తొలగించి గుంతలు పూడ్చి నీటి సదుపాయం కల్పించాలని సూచించారు. అనంతరం కొత్త కాలనీలో మజీద్‌ను సందర్శించి పరిశీలించారు.

ఏరియాల సెక్యూరిటీ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాపిత 11 ఏరియాల సింగరేణి సెక్యూరిటీ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో కార్పొరేట్ సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణ శనివారం రాత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా సింగరేణి స్థలాల ఆక్రమణల నియంత్రణకు తీసుకుంటున్న జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. అదేవిధంగా అన్ని ఏరియాల్లోని కంపెనీ స్థలాలను ఎస్టేట్స్ వారి అనుబంధంతో, సివిల్ డిపార్ట్‌మెంట్ సహకారంతో ఫెన్సింగ్, లేదా కాంపౌండ్ వాల్ నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో 11 ఏరియాల సెక్యూరిటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పుస్తకాలు ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణి గ్రంథాలయంలో నూతన పుస్తకాలు ఏరియా జీఎం వి.కృష్ణయ్య ఆవిష్కరించారు. శనివారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రామస్వామి, గిరిధర్‌రావు, నర్సింహరాజు, జీవీ మోహన్‌రావు, కోట సాంబయ్య, విగ్నేశ్వరరావు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న కార్మికుల సంఘం మహాసభ

సింగరేణి(కొత్తగూడెం): ఏప్రిల్ 5న నారాయణపేటలో జరగనున్న పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) అనుబంధం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వై.గోపాలరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జిల్లా కార్యాలయంలో మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... టీయూసీఐ యూనియన్ కార్మికులకు అండగా నిలిచి, నిత్యం వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం ఎన్నో పోరాటాలు మండల జిల్లా స్థాయిలో నిర్వహించిందన్నారు. పంచాయతీ కార్మికుల పక్షాన న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమించిందని ఈ నేపథ్యంలో ఈ మహాసభలు నిర్వహించి గత పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకోబోతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీల్లో సుమారు 60 వేల మంది కార్మికులు మల్టీపర్పస్ విధానంలో పనిచేస్తున్నారని వీరికి ఇస్తున్న జీతం కేవలం రూ.9500 లేనన్నారు. జీఓ ప్రకారం రూ.15 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేసి కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. అమరనేని రామారావు, సంగం వెంకటపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్‌కు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) అండ్(పా)గా బాధ్యతలు చేపట్టిన కే.వెంకటేశ్వర్లును శనివారం ఆయన చాంబర్‌లో ఐఎన్‌టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ బొటిక రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ... సింగరేణి సంస్థలో ఎంజీటీగా విధుల్లో చేరి అంచెలంచెలుగా ఎదిగి డైరెక్టర్ స్థాయికి చేరుకోవడం అభినందనీయం అన్నారు. కంపెనీ ఇచ్చిన అవకాశంతో మరిన్ని కొత్త ప్రాజెక్టులకు అనుమతులు సాధించి మరింత మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు.

చీరకట్టు.. మన సంప్రదాయం



మహిళలు ఒకప్పుడు ఇంటి పని.. బరువులు మోయడం.. పొలం పని.. ఏదైనా చీరకట్టులోనే చేసేవారు. ఇప్పుడు పండుగలప్పుడు కూడా అమ్మో.. మా వల్ల కాదు.. అని కొందరు.. అసౌకర్యం పేరుతో మరికొందరి వల్ల నేటితరానికి చీరకట్టు దూరమవుతోంది. కానీ.. చీర మన సంప్రదాయానికి ప్రతీక. మహిళల ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేది, హోదా, అధికారాన్ని కనబరిచేది కూడా చీరే. అందుకే ఎన్ని ఆధునిక దుస్తులు వస్తున్నా నేటికీ చీరకు ఉన్న ఆదరణ తగ్గలేదు. ముఖ్యంగా పండుగల రోజు మహిళలు చీరలు ధరిస్తే ఇల్లంతా కళకళలాడుతూ ఉంటుంది. చీర కట్టుకోవడం తెలుగింటి సంప్రదాయం. అందం, ఆడంబరం, గౌరవం మహిళకు అందించేది చీరకట్టు. పాఠశాలలు, కళాశాలల్లో వేడుకలకు హాజరయ్యే తమ పిల్లలను చీరకట్టులో అందంగా ముస్తాబు చేసి మురిసిపోతుంటారు తల్లిదండ్రులు.

- మహిళల ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వానికి ప్రతిబింబం
- చీరకట్టుకు యువతుల జేజేలు





చీరకట్టులో ఆకట్టుకుంటున్న చిన్నారులు

సండే స్పెషల్

ఇల్లెందురూరల్/కొత్తగూడెంఅర్బన్: అమ్మో.. చీరా.. కష్టం.. అనే అమ్మాయిలైనా.. పండుగలొస్తే మాత్రం ఇష్టంగా కట్టేస్తారు. పెళ్లి వేడుకలకి సరేసరి. పట్టుచీరలో పుత్తడి బొమ్మలా మెరిసిపోతారు. అందం, ఆడంబరం, గౌరవం హుందాతనం, సంప్రదాయం, సౌకర్యం, ఫ్యాషన్ ట్రెండ్.. ఇలా అన్నీ ఏక కాలంలో ప్రదర్శించగలిగేది చీరలోనే. ఐదున్నర నుంచి తొమ్మిది గజాలుండే చీర.. చూడచక్కని సంప్రదాయమే కాదు. తరతరాల కథలెన్నో చెబుతుంది. చీర ఈనాటిదా మరి.. సింధూనాగరికత నుంచీ ఉంది. చలికాలంలో స్వెట్టర్‌లా, ఎండావానల్లో గొడుగులా, కష్టంలో కన్నీటిని తుడిచే చేతిరుమాల్లా.. ఇలా చీరలో సౌకర్యాలెన్నో... అంతెందుకు పసిబిడ్డకి పదిమందిలోనూ పాలివ్వగలిగే వెసులుబాటు ఒక్క చీరకే ఉంది.

ఫ్యాషన్‌కు ఆకర్షితులై..
చీర కట్టులో ఉన్న ప్రత్యేకతలను, సౌకర్యాన్ని నేటి ఫ్యాషన్ ప్రపంచం యువతులను నూతన వస్త్రధారణ దిశగా అడుగులు వేయిస్తోంది. చీర కట్టుకోవడం ఓ కళ. కానీ ఈతరం అమ్మాయిలకు ఇది కష్టమైన ప్రక్రియ. ప్రతీ దాంట్లోనూ సులభమైన మార్గాన్ని ఎంచుకుంటున్న నేటి యువతులు చీరకు ప్రత్యామ్నాయ వస్త్రధారణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా చీరకట్టు అసౌకర్యంగా భావించి ఆధునిక ఫ్యాషన్లకు ఆకర్షితులైన యువతులు చీరకు బదులుగా పంజాబీ, చుడీదార్, లెహెంగాలు తదితర డ్రెస్‌లను వినియోగంలోకి తెచ్చుకుంటున్నారు.

చీరకట్టుపై మక్కువ పెరిగేలా..
పూర్వం పెద్దలు తమ పిల్లలకు యుక్త వయస్సు సమయంలో చీరలు కట్టించి సంబురం చేసుకునేవారు. కానీ నేడు అటువంటి పండుగలు చాలా వరకు కనుమరుగవుతున్నాయి. కానీ పాఠశాలలు, కళాశాలల్లో వేడుకలకు హాజరయ్యే తమ పిల్లలను చీరకట్టులో అందంగా ముస్తాబు చేసి మురిసిపోతుంటారు. ఇలా నేటి యువత క్రమంగా ఓణీలు, చీరకట్టుపై మక్కువ పెంచుకునేలా పెద్దలు తీసుకుంటున్న జాగ్రత్తలు భవిష్యత్ తరాలకు దిక్సూచిగా నిలిచేందుకు తోడ్పడుతున్నాయి.

తెలుగింటి సంప్రదాయం..



చీర కట్టుకోవడం తెలుగింటి సాంప్రదాయం. అందం, ఆడంబరం, గౌరవం మహిళకు అందించేది చీరకట్టు మాత్రమే. అందుకే కళాశాల స్థాయి నుంచే అవకాశం దొరికినప్పుడల్లా చీరకట్టుకుంటా. కుటుంబ సభ్యులూ సంప్రదాయన్నే ప్రోత్సహిస్తారు. – ఆళ్ల శృతి, సుభాష్‌నగర్

చీరకట్టు అంటేనే ఇష్టం..



కళాశాల స్థాయి నుంచి ప్రతీ పండుగకు చీర కట్టుకోవడం ఆనందాన్ని ఇస్తోంది. సంప్రదాయ దుస్తులతో కలిగే సంబురాన్ని ఆధునిక ఫ్యాషన్లు అందివ్వవు. భవిష్యత్‌లో ఏ స్థాయికి చేరినా చీరకట్టునే సంప్రదాయ వేషధారణగా ఆచరిస్తా. ఇతరులకూ సూచిస్తా. – వరద జాహ్నవి, సుభాష్‌నగర్

ప్రతీ కుటుంబం ప్రోత్సహించాలి..



తెలుగింటి ఆడపడుచుకు చీర కట్టు హుందాతనాన్ని ఇస్తుంది. మహిళ ఆత్మవిశ్వాసాన్ని, వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేది చీర మాత్రమే. అంతటి ప్రాధాన్యం కలిగిన చీరకట్టును నేటితరం విస్మరిస్తోంది. కుటుంబ పెద్దలే ప్రోత్సహించి చీరకట్టుకోవడం అలవాటుగా మార్చాలి. – వేముల సుగుణ, బాలాజీనగర్

అభివృద్ధికి నిరంతర కృషి..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రభుత్వానికి అభివృద్ధి పనుల ప్రాధాన్యతను వివరిస్తూ నిధులు సాధిస్తున్నాం. నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయినేజీ లేని గల్లీ ఉండదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం లభించిందని రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతాయని చెప్పారు. అమృత స్కీమ్ కింద కొత్తగూడేనికి రూ.120 కోట్లు, పాల్వంచకు రూ.60 కోట్లు మంజూరవుతాయని తెలిపారు. రూ.200 కోట్లతో 25 ఎకరాల స్థలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. కేంద్రీయ విద్యాలయం మంజూరు ఢిల్లీ స్థాయిలో ఉందని, త్వరలో మంజూరు లభిస్తుందన్నారు. పోస్టాఫీస్ సెంటర్‌లోని సింగరేణి పాఠశాలను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. సింగరేణి మహిళా కళాశాలలో ఎంబీఏ, బీబీఏ, బీసీఏ కోర్సులకు మంజూరు లభించిందని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐని సింగరేణి సీఎస్ఆర్ పాలసీ కింద ఆధునీకరిస్తామని వివరించారు. సుజాతనగర్‌లో ప్రభుత్వ జూనియర్ కాలేజీకి అనుమతి లభించిదన్నారు. కొత్తగూడెం, పాల్వంచ డిగ్రీ కళాశాలలకు రూ.8కోట్లు మంజూరైనట్లు చెప్పారు. అగ్రికల్చర్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు కేటాయించారని తెలిపారు. పాల్వంచ ప్రభుత్వాస్పత్రి 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అవుతుందని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతీ ఎకరానికి సాగునీరు అందించేందుకు సీతారామ ప్రాజెక్టు లేదా కిన్నెరసాని బ్యాక్ వాటర్ ఏదీ లేకపోతే మోటార్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. విమానాశ్రయ ఏర్పాటుకు చిన్న సాంకేతిక సమస్య ఏర్పడిందని తప్పకుండా సాధిస్తామన్నారు. నియోజకవర్గ వ్యాపితంగా రూ.500 కోట్లతో రింగ్‌రోడ్డు, ఫ్లై ఓవర్ నిర్మించనున్నట్లు వివరించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌కె సాబీర్ పాషా, మత్యాల విశ్వనాథం, దుర్గరాశి వెంకన్న, చంద్రగిరి శ్రీనివాసరావు, వీరాస్వామి, వాసిరెడ్డి మురళి, దస్రు, బత్తుల సురేష్, ఉప్పుశెట్టి రాహుల్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తా..
కొత్తగూడెంఅర్బన్: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడు సిద్ధంగా వుంటానని, వారి చిరకాల వాంఛ ఇంటి స్థలం ఇప్పించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం గంగబిషన్ బస్తీలో పది రోజులుగా జర్నలిస్టులు చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం జర్నలిస్టులకు ఇవ్వనున్న 10 ఎకరాలకు ఫెన్సింగ్ వేయిస్తానని, ఎలా పంపిణీ చేయాలనే అంశంపై కలెక్టర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుందామని చెప్పారు. అనంతరం జర్నలిస్టులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు.

సమస్త మానవాళి సమానత్వంతో ఉండాలి
పాల్వంచ: సమస్త మానవాళి సమానత్వంతో ఉండాలని ఎమ్మెల్యే కూనంనేని అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక సుగుణ గార్డెన్స్‌లో ముస్లింలు ఇఫ్తార్ నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రపంచ మానవాళికి అనుసరణీయం అన్నారు. రంజాన్ ఉత్సవాల్లో పేదలను భాగస్వామ్యం చేయాలన్నారు.

గోదావరి జలాల కోసం పోరాటం



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

సింగరేణి(కొత్తగూడెం): సీతారామ ప్రాజెక్ట్‌కు నిధులు పెంచి, పనులు వెంటనే ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సాగు భూములన్నింటికీ గోదావరి జలాలు సాధించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి కాకుండా గోదావరి నీళ్లు ఎలా తీసుకొస్తారని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా ప్రజలను భ్రమింపజేస్తున్నారని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

కొత్తగూడెంఅర్బన్: యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. ఇటీవల జరిగిన జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన లక్కినేని సత్యనారాయణను శనివారం పవర్ హౌస్ జిమ్ నిర్వాహకులు, కోచ్ షమీఉద్దీన్ కలిసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ... యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సక్రమమైన మార్గంలో వెళ్తూ తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని, ప్రతీరోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా దృఢంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. దేశ భవిష్యత్ యువతీ యువకులపైనే ఆధారపడి ఉందని, యువత ఆరోగ్యంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉన్నట్టు అన్నారు. యర్రా కామేష్, మారపాక రమేష్, నున్న శివ, అజయ్, సందీప్ పాల్గొన్నారు.

పక్కా ఇళ్లు మంజూరు చేయాలి



ధర్నా చేస్తున్న ఆదివాసీ గిరిజనులు, మాస్‌లైన్ నాయకులు

జూలూరుపాడు: గిరిజన ఆదివాసీ కుటుంబాలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ మాట్లాడుతూ.. మండల కేంద్రం జూలూరుపాడులో నివాసం ఉంటున్న ఆదివాసీ గిరిజనులకు 2007లో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, పట్టాలు కూడా ఇచ్చారని, ఆ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నట్లు చెప్పారు. వీరికి ఇళ్లు ఇవ్వడంతోపాటు, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలన్నారు. వర్షాకాలంలో గిరిజన ఆదివాసీలు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. అనంతరం తహసీల్దార్ కె.స్వాతి బిందు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బానోత్ ధర్మా, రాయల సిద్ధు, రాములమ్మ, చిట్టెమ్మ, మల్లేశ్వరి, మల్లిక, చుక్కమ్మ, రుక్మిణి, పుల్లమ్మ, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీరో వ్యాపారం అరికట్టండి..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య, పక్కన మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు

ఇల్లెందు: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ ఏడాది కాలంగా ఎంతో అభివృద్ధి సాధించిందని, రానున్న కాలంలో మరింత అభివృద్ధి సాధించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం మార్కెట్ యార్డులో చైర్మన్ బానోతు రాంబాబు అధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది కాలంగా మార్కెట్ ప్రగతి పథంలో ముందుకెళ్తుందన్నారు. లైసెన్సుల సంఖ్య పెంచుతూ వ్యాపారులు ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇల్లెందు మార్కెట్‌లో ఏసీ గోదాం నిర్మాణంతో పాటు ఓపెన్ గోదాంల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు మాట్లాడుతూ.. 2022–23లో రూ.3.82కోట్లు, 2023–24లో రూ.3.86కోట్లు, 2024–25లో రూ.5.13కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. టేకులపల్లిలో మిర్చి కొనుగోలు చేపట్టి 311 మంది రైతుల నుంచి 1100 క్వింటాళ్ల మిర్చి కొనుగోలు చేసినట్లు తెలిపారు. కారేపల్లిలోని సీసీఐ కేంద్రంలో ఇల్లెందు మార్కెట్ పరిధిలోని 1,629 మంది రైతులు 43,293 క్వింటాళ్ల పత్తి అమ్ముకున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ సెక్రెటరీ సుచిత్ర, నరేష్‌కుమార్, వైస్ చైర్మన్ బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వం తరుపున ఇఫ్తార్
రంజాన్ సందర్భంగా ముస్లింలకు ప్రభుత్వం తరుపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శనివారం ఐతా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు ఎమ్మెల్యే రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్యకు ముస్లింలు దట్టీ కట్టి, టోపీ ధరింపజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, తహసీల్దార్ కె.రవికుమార్, డీఎస్పీ చంద్రభాను, కమిషనర్ శ్రీకాంత్, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, మడుగు సాంబమూర్తి, మండల రాము, బోల్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గడువు పెంచండి..

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు గడువు తేదీని పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... రాజీవ్ యువ వికాసం పథకం కోసం రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు తప్పనిసరిగా జత పరచాలని చెబుతున్నారని, రేషన్ కార్డు లేకపోయినా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. దీనికి గడువు ఏప్రిల్ 5వ తేదీతో ముగియనున్న దృష్ట్యా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సెలవుల్లోనూ ప్రత్యేక కౌంటర్లు

ఇల్లెందు: మున్సిపాలిటీలో ఆస్తి, పంపు, ట్రేడ్ లైసెన్సులకు నెల చివరి రోజుల్లో కూడా బకాయిలు చెల్లించవచ్చని, రెండు రోజులు సెలవులున్నా కౌంటర్లు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. శనివారం ఇల్లెందులో ఆయన మాట్లాడుతూ... 30, 31 తేదీల్లో ఉగాది, రంజాన్ పండుగ సెలవులు ఉన్నాయని, ఈ సెలవుదినాల్లో కూడా మున్సిపాలిటీలో పన్నులు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లు తెరిచి ఉంచుతున్నట్లు తెలిపారు. ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఇల్లెందురూరల్: ఏప్రిల్ 4న నారాయణపేట జిల్లాలో నిర్వహించనున్న టీయూసీఐ అనుబంధ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కొమరారం గ్రామంలో సంఘం నాయకులు శనివారం ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూక్యా లక్ష్మణ్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన దీక్షలకు మద్దతుగా ప్రస్తుత మంత్రులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని, ఏడాది గడుస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో పంచాయతీ కార్మికులకు కూడా పీఆర్సీ అమలు చేయాలని, జీఓ నంబర్ 60 ప్రకారం కార్మికులకు 16,500 వేతనం చెల్లించాలని కోరారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

జూలూరుపాడు: ఏప్రిల్ 3న పాపకొల్లు గ్రామంలో జరగనున్న శ్రీ బాలాజీ బుడియా బాపు జాతర మహోత్సవానికి హాజరు కావాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను శనివారం ఆయన క్యాంప్ ఆఫీస్‌లో నిర్వాహకులు కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో బానోత్ రవి కుమార్, బానోత్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఆర్టిజన్లుగా తీసుకోండి..



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పాల్వంచ: కేటీపీఎస్ 6వ దశ నిర్మాణంలో పనిచేసిన కార్మికులను ఆర్టిజన్లుగా తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో ఆరో దశ నిర్మాణ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలకు శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... నిర్మాణంలో ప్రాణాలకు తెగించి పనిచేశారని, అర్హులైన వారిని ఆర్టిజన్లుగా తీసుకుంటామని గతంలో యాజమాన్యం లిఖిత పూర్వక హామీ ఇచ్చి కూడా విస్మరించారని తెలిపారు. అర్హులైన 418 మందిని ఆదుకోవాలని, లేదంటే కేటీపీఎస్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాతోజు సత్య, అంకిరెడ్డి నరసింహారావు, హథీరామ్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలల్లో పూర్వప్రాథమిక తరగతులు ప్రారంభించాలని టీజీ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. శనివారం పాల్వంచ యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. క్రమంగా నిధులను 20శాతంకు పెంచాలని, వచ్చే విద్యాసంవత్సరం నుంచే ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక కేంద్రీకరణ జరగాలని, వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బి.రాజు, ఎం.వెంకటేశ్వర్లు, షేక్.పాషా, ఎ.విజయ భాస్కర్, బి.జానకి, రాములు పాల్గొన్నారు.

ట్రైకార్ రుణాలు ఇవ్వండి..



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

జూలూరుపాడు: లబ్ధిదారులకు ట్రైకార్ రుణాలు ఇవ్వాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గిరిజనులకు ట్రైకార్ రుణాల కోసం రూ.219 కోట్లు నిధులు విడుదల చేసిందని, ఈ రుణాల కోసం లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. జాబితాలోని లబ్ధిదారులు డీడీలు కట్టిన తరువాత ట్రైకార్ రుణాలు ఆగిపోయినట్లు చెప్పారు. గిరిజనులకు ట్రైకార్ రుణాలు ఇవ్వకపోతే ఏప్రిల్ 7న హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ కార్యాలయాన్ని గోర్ బంజారా పోరాట సమితి ఆధ్వర్యంలో ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగరాజు చౌహాన్, మీరాబాయి, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

శాశ్వత మార్కెట్ ఏర్పాటుకు కృషి



వైరా ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో శాశ్వత వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం ఎమ్మెల్యేను వైరాలోని క్యాంప్ ఆఫీస్‌లో ప్రజా సంఘాల జేఏసీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.

అదేవిధంగా భద్రాచలం ఐటీడీఏ పీఓ. డేవిడ్ రాజ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. రైతు, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు బానోత్ ధర్మా, బానోత్ మధు, జాటోత్ కృష్ణ, గుగులోత్ కేశవ్ నాయక్, లకావత్ నాగేశ్వరరావు, భూక్యా శివ, శంకర్, హమాలీలు గత్తం బాబురావు, పప్పుల జాను, ఇల్లంగి సుందర్‌రావు, పోతురాజు బోడయ్య, నరసింహారావు, చంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో...
మండల కేంద్రం జూలూరుపాడులో శాశ్వత వ్యవసాయ మార్కెట్‌ను నెలకొల్పాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ దేశ్‌పాండేకు వినతిపత్రం అందజేశారు. వల్లోజి రమేష్, బత్తుల గోపి, కల్తి బాబు, సురేష్, నరసింహారావు పాల్గొన్నారు.